### మేకల కాపరి అదృశ్యంపై ఫిర్యాదు

కలువాయి: మండలంలోని పెరంకొండకు చెందిన పొదిలి మల్లికార్జున అనే వ్యక్తి మేకలు కాచుకునేందుకు అడవికి వెళ్లి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు మంగళవారం కలువాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

గూడూరురూరల్: చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ ఎస్‌కే మహబూబీ అన్నారు. గూడూరు మండలంలోని అయ్యవారిపాళెంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.

### ప్రింటర్ బహూకరణ

సూళ్లూరుపేట: మన్నారుపోలూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ అకస్మికంగా మృతి చెందిన టి వైష్ణవి జ్ఞాపకార్థం ఆమె తల్లిదండ్రులు మంగళవారం ఒక ప్రింటర్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్దన్‌కు అందజేశారు.

### 24 లోగా దరఖాస్తులు చేసుకోండి

నాయుడుపేటటౌన్: పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతిభ చూపే మహిళలకు ప్రభుత్వం అందించే స్వచ్ఛత వార్డులకు ఈ నెల 24 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసరావు తెలిపారు.

### ఉగాది వేడుకలు ప్రారంభం

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలోని నరసారెడ్డికండ్రిగ గ్రామంలో ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయంలో మంగళవారం సాయంత్రం అంకుర్పాణ పూజలతో ఉగాది వేడుకలు ప్రారంభమయ్యాయి.

### సమస్యలు పరిష్కరించాలని వినతి

వెంకటగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ ఏ శంకరయ్య మంగళవారం వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు.

### ఎమ్మెల్సీతో చిల్లకూరు నేతల భేటీ

చిల్లకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను మంగళవారం చిల్లకూరు మండలానికి చెందిన నాయకులు గూడూరులో కలిసి, సత్కరించారు.







# పేద పిల్లల ఉన్నతే సీఎం జగన్ లక్ష్యం




సూళ్లూరుపేట: విద్యార్థినికి రాగిజావ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, గూడూరు: రాగి జావను అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సూళ్లూరుపేట/గూడూరు/వెంకటగిరి: రాష్ట్రంలోని పేద విద్యార్థుల ఉన్నతి, పోషకాహార పంపిణీనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, వెలగపల్లి వరప్రసాద్‌రావు, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు రాగిజావ అందించే కార్యక్రమాన్ని సూళ్లూరుపేట జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, వెంకటగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్లు పోలూరు పద్మామిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యులు విజయలక్ష్మి, మునిప్రసాద్, బీ మహేశ్వర్, కోఆప్షన్ సభ్యులు కే సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు మీరారెడ్డి, గునపాడు మధుసూదన్‌రెడ్డి, చిట్టమూరు జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, గూడూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, సతీష్‌రెడ్డి, జనార్దన్, అన్నం మురళి, సీనియర్ నేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్ పర్సన్ దొంతు శారద, ఎంపీపీ తనూజారెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కోట, వాకాడు, చిల్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం, పెళ్లకూరు, నాయుడుపేట, రాపూరు, గోనుపల్లె, కలువాయి, సైదాపురం తదితర అన్ని మండలాల్లో ఆయా స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



వెంకటగిరి: రాగిజావ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

### ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు

నాయుడుపేటటౌన్: శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రజలందరికీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో తులతూగాలన్నారు.

### మొలకలొచ్చిన ధాన్యం

వాకాడు: అకాల వర్షాలకు తడిసిన ధాన్యం మొలకలు వస్తోంది. ఇటీవల పలువురు రైతులు వరి కోసి, రోడ్లపై ఆర బెట్టుకుంటున్న నేపథ్యంలో అకాల వర్షాలు మూడు రోజులుపాటు కురడవంతో ధాన్యం తడిచిపోయింది. దీంతో అడుగు భాగంలో ఉన్న ధాన్యం మొలకలు వచ్చాయి.

### నీటిని బయటకు పంపాలి

సైదాపురం: రైతులు తక్షణమే పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని వ్యవసాయ సహాయకురాలు పుష్పలత కోరారు. మండలంలోని మొలకలపూండ్ల గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు.

### సదస్సును జయప్రదం చేయండి

గూడూరురూరల్: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 25 వ తేదీ జరిగే డివిజన్ సదస్సుకు ఆటో, భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు.

### రైల్వే ప్రయాణికులకు అవగాహన

గూడూరు: స్థానిక రైల్వేస్టేషన్‌లో యూటీఎస్ యాప్‌పై మంగళవారం రైల్వే ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే శాఖ నూతనంగా తీసుకొచ్చిన ఈ యాప్ ఉపయోగాలను ప్రజలకు వివరించారు.

### సంగీత, నృత్య ప్రదర్శనలు విజయవంతం చేయండి

గూడూరు: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు జరగనున్న సంగీత, నృత్య ప్రదర్శనలను జయప్రదం చేయాలని పొన్నలూరు వీరరాఘవరెడ్డి సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపల్ పిండి మల్లిక కోరారు.

### మోడల్‌స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

వెంకటగిరి: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన వై భువనేశ్వరి, ఎం గురుసాయి, షేక్ అబ్దుల్ రఫీమ్, షేక్ సుమయ, జి గురుశివ, పూజిత శివ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ డి తులసిజ్యోతి తెలిపారు.

### పోషకాహార విలువలపై అవగాహన

నాయుడుపేటటౌన్: పోషకాహార విలువలపై చిన్న పిల్లల తల్లులకు ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి అవగాహన కల్పించారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషక పక్వాడా కార్యక్రమాన్ని సీడీపీఓ ప్రారంభించారు.

### విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలం పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బెల్లంకొండ రమణయ్య గేదెను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన రోజులానే తన గేదెను మేతకు తోలగా ఆ గ్రామానికి చెందిన కళ్యాణ్‌చక్రవర్తి పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.

### బెల్టు షాపులపై ఎస్ఈబీ దాడులు

నాయుడుపేటటౌన్: సర్కిల్ పరిధిలో పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో మేనకూరు వద్ద కందాటి ఖదార్‌ని అరెస్టు చేసి, 15 మద్యం బాటిళ్లు, పెళ్లకూరు మండలం శిరసనంబేడు వద్ద గునిశెట్టి రమణయ్య పట్టుకుని అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): చిరుధాన్యాలను తరచుగా ఆహారంగా తీసుకుంటే పోషక విలువలు పెరిగి ఆరోగ్యకరంగా ఉండవచ్చని ఏపీఎం విజయమ్మ పేర్కొన్నారు. బాలాయపల్లిలో ఎఫ్‌పీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం మిల్లెట్స్ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

### వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలి

సూళ్లూరుపేట రూరల్: వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా నివారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ పేర్కొన్నారు. సూళ్లూరుపేట మండలంలోని కొరిడి, దామరాయి, కడపత్ర పంచాయతీలో తాగునీటి దొరువులను మంగళవారం ఆయన పరిశీలించారు.

### జీవకోటికి నీరే ప్రాణాధారం

గూడూరురూరల్: ప్రకృతిలో జీవకోటికి నీరే ప్రాణాధారమని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి.నందకుమార్ అన్నారు. విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

### పూర్తి బాధ్యత అధికారులదే

పెళ్లకూరు: జగనన్న లేఅవుట్ల లెవలింగ్ పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయించే బాధ్యత స్థానిక ఉపాధిహామీ అధికారులదేనని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

### శ్రీసిటీ చైర్మన్ రవీంద్ర సన్నారెడ్డిని సత్కారం

సూళ్లూరుపేట: షార్ బస్టాండ్ సెంటర్ జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీసిటీ చైర్మన్ రవీంద్ర సన్నారెడ్డిని సత్కరించారు. ఆయనకు విక్రమ్ సింహపురి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా వారు ఆయనకు శాలువ కప్పి, సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నాయుడుపేటటౌన్: మండలంలోని బిరదవాడ సమీపంలో మంగళవారం బైక్ ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ(50) తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు భిక్షాటన చేసే మహిళగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం జరపనున్నట్లు వారు తెలిపారు.

### గూడూరులో యాచకుడి హత్య

గూడూరు: మత్తుకు అలవాటు పడిన ఇద్దరు భిక్షగాళ్లు మత్తు పదార్థం కోసం ఘర్షణ పడి, ఒక యాచకుడిని మరో భిక్షగాడు బండరాయితో మోది హత్య చేసిన సంఘటన మంగళవారం రాత్రి గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలోని చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. రైళ్లల్లో యాచకులుగా ఉన్న ఇద్దరు గుర్తు తెలియని యువకులు మత్తు పదార్థం కోసం ఘర్షణ పడ్డారు. సుమారు 20 సంవత్సరాలున్న యాచకుడిని మరో భిక్షగాడు బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలపై విచారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. హత్య చేసిన వ్యక్తి పరారు కావడంతో వీరు ఎక్కడి వారు అనే వివరాలు తెలియలేదు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### ఉపాధి పనులపై విచారణ

కోట: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై మంగళవారం ఏపీడీ రవికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో అధికారులు ఊనుగుంటపాళెం, రుద్రవరం, కేసవరం, కొత్తపాళెంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి జరిగిన ఉపాధి పనులపై విచారణ చేపట్టారు.

### పోలీస్‌స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్న పత్రాలు

నాయుడుపేటటౌన్/పెళ్లకూరు: ఏప్రిల్ 3 తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లకు చేరాయి.

### 27న గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తెలిపారు.